

సమస్యల పరిష్కారానికే..

రైతుల భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి ప్రవేశ పెట్టినట్లు అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పేర్కొన్నారు.

- 8లో ▸



ప్రభుత్వ పాఠశాలల్లోనే..

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యా బోధన జరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.2 /22.4

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతం అవుతుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా సీతక్క



నిజామాబాద్‌అర్బన్ : జిల్లా ఇన్‌చార్జి మంత్రి గా రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతకుముందు ఇన్‌చార్జి మంత్రిగా పనిచేసిన జూపల్లి కృష్ణారావు ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియామకమయ్యారు. ఆదిలాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా కొనసాగిన సీతక్క ఇక్కడికి వస్తున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు జిల్లాకు మంత్రి పదవి దక్కకపోగా, ఇన్‌చార్జి మంత్రిగా సీతక్క రావడంపై రాజకీయ వర్గాల్లో చర్చజరుగుతోంది.

ఆర్టీసీ కాలనీలో పిడుగుపాటు



మాక్లూర్: మండలంలోని మానిక్‌భండార్ శివారు ఆర్టీసీ కాలనీలో గురువారం ఉదయం చిట్యాల జనార్దన్ ఇంటిపై పిడుగుపడింది. ఇంటి పైకప్పు స్వల్పంగా ధ్వంసమైంది. ఇంట్లోని ఫ్యాన్లు, ఫ్రిజ్, టీవీ కూడా పని చేయటం లేదని జనార్దన్ తెలిపారు.

స్కూల్ బస్సుల తనిఖీ

ఖలీల్‌వాడి : నగరంలోని వినాయక్ నగర్‌లో రవాణా శాఖ అధికారులు స్కూల్ బస్సుల తనిఖీలు నిర్వహించారు. డిప్యూటీ రవాణా శాఖ కమిషనర్ దుర్గా ప్రమీల ఆధ్వర్యంలో ప్రైవేట్ స్కూల్ బస్సులను ఆపి, బస్సులో లోపలి భాగంలో నిబంధనల మేరకు అన్నీ సక్రమంగా ఉన్నాయో? లేదో? పరిశీలించారు. ఫిట్‌నెస్ పత్రాలు లేని ఓ స్కూల్ బస్సుపై కేసు నమోదు చేశారు. నిబంధనల మేరకు లేని బస్సులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో ఇన్‌చార్జి డీటీవో రాహుల్, ఎంవీఐ కిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


ఎస్సారెస్పీలోకి 2,080 క్యూసెక్కుల వరద

బాల్కొండ: స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి 2,080 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్ట్ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100, మిషన్ భగీరథ ద్వారా 231, ఆవిరి రూపంలో 321 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 (80.5 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1062.8 (13.36 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

నిజాంసాగర్‌లోకి స్వల్ప ఇన్‌ఫ్లో

నిజాంసాగర్(జుక్కల్): ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 590 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 1393.5 అడుగుల (5.9 టీఎంసీలు) నీరు నిల్వ ఉందన్నారు.

సాయుధ దళాల నిధికి రూ.లక్ష విరాళం



సుభాష్‌నగర్: దేశ రక్షణ కోసం తమ జీవితాలను త్యాగం చేస్తున్న భారత త్రివిధ దళాల సేవలు మరువలేనివని, వారి సంక్షేమానికి పౌరునిగా చేయూతనందిస్తూ సాయుధ దళాల పతాక నిధికి విద్యుత్ శాఖ రిటైర్డ్ ఉద్యోగి, కామారెడ్డికి చెందిన కే కృష్ణమూర్తి రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఈ మేరకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి డీ రమేశ్‌కు ఆయన గురువారం చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి శర్మ దంపతులను శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం అధికారి రమేశ్ మాట్లాడుతూ కృష్ణమూర్తి శర్మను స్ఫూర్తిగా తీసుకొని ఉమ్మడి జిల్లాలోని వ్యాపారులు, ప్రజలు దేశ రక్షణలో విధులు నిర్వహిస్తున్న సైనికులు, వారి కుటుంబాలకు స్వచ్ఛందంగా విరాళాలు అందించి చేయూతనందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రాంతీయ సైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బంది బదాం గంగామోహన్, ఉమేర్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లపై కొత్వాల్ నజర్



నగరంలోని ఓ హోటల్ వద్ద ఆటో డ్రైవర్‌ను ఓ రౌడీషీటర్‌తోపాటు అనుచరులు బెదిరించి దాడి చేశారు. దాడి చేసిన వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బాధితుడు భయపడ్డాడు. విషయం తెలిసి సీపీ ఆదేశించడంతో పోలీసులు ఎంట్రీ ఇచ్చి సదరు రౌడీషీటర్, అతడి అనుచరులపై కేసులు నమోదు చేశారు.

జిల్లా కేంద్రంలో కొన్ని ప్రాంతాలు రౌడీ షీటర్లకు అడ్డాగా మారాయి. అమాయక ప్రజలను బెదిరించడం, దాడులు చేసిన ఘటనలు ఉన్నాయి. గ్యాంగ్‌ల మధ్య పోటీ పెరిగి ఇరువర్గాలు కత్తులు దూసుకోవడం, ఒకరినొకరు చంపుకోవడం మామూలుగా మారింది. రౌడీ షీటర్లపై సీపీ పోతరాజు సాయి చైతన్య దృష్టి సారించారు. వారు తీరుమార్చుకుంటే రౌడీషీట్ తొలగిస్తామని, లేకుంటే పీడీయాక్ట్ ప్రయోగిస్తామని హెచ్చరిస్తున్నారు.

- నగరంలో 240 మంది, ఇతర ప్రాంతాల్లో 115 మందిపై రౌడీ షీట్
- అక్రమ దందాల అడ్డుకట్టకు సీపీ పోతరాజు సాయిచైతన్య దృష్టి
- రంగంలోకి సీసీఎస్, టాస్క్‌ఫోర్స్ బృందాలు
- అమాయకులను బెదిరిస్తే శిక్షలు కఠినంగా ఉంటాయని హెచ్చరికలు

ఖలీల్‌వాడి : జిల్లాలోని రౌడీషీటర్ల ఆగడాలపై పోలీస్ బాస్ నిఘా పెంచారు. రౌడీలుగా చలామణి అవుతున్న వారి కార్యకలాపాలపై నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పోతరాజు సాయిచైతన్య ప్రత్యేక దృష్టి సారించారు. తమకు తాముగా మారితే రౌడీషీట్ తొలగిస్తామని, లేకుంటే పీడీయాక్ట్ ప్రయోగిస్తామని హెచ్చరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 355 మంది రౌడీషీటర్లు ఉండగా, అందులో 240 మంది వరకు నగరంలోనే ఉన్నారు. ఇల్లీగల్ దందాను అడ్డుపెట్టుకొని రౌడీషీటర్లు అమాయక ప్రజలను బెదిరించడం, దాడులు చేసిన ఘటనలు ఉన్నాయి. గతంలో రౌడీషీటర్ల మధ్య ఆధిపత్య పోరుతో ఇబ్రహీం ఛావూస్ అలియాస్ జంగిల్ ఇబ్బు, ఆరిఫ్‌డాన్ హత్యకు గురైన విషయం తెలిసిందే. దీంతో రౌడీ షీటర్ల ఆటకట్టించేందుకు సీపీ ప్రత్యేకంగా సీసీఎస్, టాస్క్‌ఫోర్స్ పోలీసులను రంగంలోకి దించారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని నిఘా వర్గాల ద్వారా రౌడీషీటర్లు చేస్తున్న పనులపై ఆరా తీస్తున్నారు.

ప్రత్యేక బృందాలు ఏర్పాటు..

రౌడీ షీటర్ల ఆటకట్టించేందుకు సీపీ సాయి చైతన్య ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అక్రమ దందాలు నిర్వహించే, రౌడీ షీటర్ల ప్రభావం ఉండే ప్రాంతాలపై దృష్టి సారించి సామాన్యులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. అమాయక ప్రజలపై బెదిరింపులు, దాడులకు పాల్పడితే శిక్షలు కఠినంగా ఉంటాయని ఇప్పటికే పలువురు రౌడీ షీటర్లకు హెచ్చరికలు పంపారు. రౌడీ షీటర్లు ఎవరినైనా బెదిరించినా, భయపెట్టినా స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని పోలీసులు సూచిస్తున్నారు.

ఆ ప్రాంతాల్లోనే అక్రమ దందాలు

నగరంలోని మాలపల్లి, ఆటోనగర్, సారంగాపూర్, నెహ్రూనగర్, బాబాన్‌సాహెబ్ పహాడ్, బోధన్ రోడ్డు, నాగారం ప్రాంతంలో అక్రమ దందా జోరుగా సాగుతోంది. ఇక్కడ బిహార్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు చెందినవారు ఎక్కువగా ఉంటారు. గంజాయి, మట్కా, భూ మాఫియా, మామూళ్ల వసూళ్ల ఎక్కువగా జరుగుతాయి. వ్యాపారంలో పోటీ పెరగడంతో ఇరువర్గాల మధ్య కత్తులతో దాడులు కొనసాగుతున్నాయి. రౌడీషీటర్లు ఎక్కువగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి వాటిని రూ.70 వేల నుంచి రూ. 2 లక్షల వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. ప్లాట్లు కొనుగోలు చేసి అందుబాటులో లేని వారి స్థలాలను ఆక్రమించి ఇతరులకు విక్రయించేస్తున్నారు.

దీంతో అసలు యజమానులు వచ్చేసరికి ఇంటి స్థలంలో నిర్మాణాలు కనిపిస్తున్నాయి. ఇదేమిటని ప్రశ్నిస్తే రౌడీషీటర్ల అనుచరులు దాడులు చేయడంతోపాటు కత్తులు చూపించి బెదిరింపులకు పాల్పడిన ఘటనలూ ఉన్నాయి. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు జంకే పరిస్థితి ఏర్పడింది.

పదవులు దక్కని సీనియర్లెవరు?

- పూర్తి వివరాలు తెప్పించుకుంటున్న మీనాక్షి నటరాజన్
- పార్టీ పదవులతో పాటు స్థానిక సంస్థల పదవుల్లో ప్రాధాన్యత ఇచ్చేందుకు ప్రణాళిక
- ఎమ్మెల్యేలు, కీలక నాయకులతో విడివిడిగా చర్చించిన రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి
- ఆశావహుల్లో ఉత్కంఠ



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : అధికార కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవుల కోసం జిల్లాకు చెందిన పలువురు సీనియర్లు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు డీసీసీ అధ్యక్ష పీఠం కోసం, బ్లాక్, మండల అధ్యక్ష పదవుల కోసం పలువురు నాయకులు పోటీ పడుతున్నారు. అయితే కీలకమైన స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సైతం పలువురు ఆశావహులు ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేసుకుంటున్నారు. రిజర్వేషన్లు ఎలా వస్తాయనే విషయమై లెక్కలేసుకుంటూ ఎదురు చూస్తున్నారు. అయితే జిల్లా అధ్యక్ష పీఠం కోసం, మండల అధ్యక్ష పదవుల కోసం దరఖాస్తులు చేసుకునేవారు ఎక్కువగా ఉన్నారు. దీంతో పార్టీ కోసం కష్టపడిన వారికి ఎక్కువ అవకాశాలు కల్పించేందుకు గాను పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కసరత్తు చేస్తున్నారు. మీనాక్షి నటరాజన్ క్షేత్రస్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని పకడ్బందీగా చేసే లక్ష్యంతో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇందుకు అనుగుణంగానే పార్టీ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలోకి దించేందుకు అవకాశాలు కల్పించేందుకు ఆమె కృషి చేస్తున్నట్లు తెలుస్తోంది.

గ్రామ స్థాయి నుంచి..

నిబద్ధత కలిగిన నాయకురాలిగా పేరున్న మీనాక్షి నటరాజన్ పార్టీ పదవులకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ క్రమంలో ప్రతి నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యేతో, ఎమ్మెల్యేలు లేని చోట కీలకమైన నాయకులతో విడివిడిగా మీనాక్షి సమావేశమవుతున్నారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అదేవిధంగా ప్రతి జిల్లా నుంచి, మండలం నుంచి, గ్రామం నుంచి ఆయా నాయకులవారీగా పూర్తి వివరాలను తెప్పించుకుంటున్నారు. ఆయా నాయకులు పార్టీలో ఎన్నేళ్ల నుంచి పనిచేస్తున్నారు.. పార్టీ అధికారంలో లేని సమయంలో, కష్టకాలంలో పార్టీ కార్యక్రమాలు నిర్వహించిన తీరు, పాల్గొన్న విషయాలపై పూర్తి వివరాలు తెప్పించుకున్నారు. ఆయా నాయకుల సీనియారిటీతో పాటు ఇప్పటివరకు పదవులు రానివారి వివరాలను ప్రత్యేకంగా పూర్తిస్థాయిలో తెప్పించుకున్నారు. రాష్ట్ర స్థాయిలో పదవులకు ఎవరు అర్హులు, జిల్లా స్థాయిలో ఎవరిని ఏఏ పదవులకు ఎంపిక చేయాలి, మండల స్థాయిలో మండల అధ్యక్ష పదవుల కోసం పోటీపడుతున్నవారి వివరాలతో పాటు, జిల్లా ప్రజాపరిషత్, మండల ప్రజాపరిషత్, సర్పంచ్, నామినేటెడ్ పదవులను ఇచ్చేందుకు ఎంపిక చేయాల్సిన వారికి ఇవ్వాల్సిన అర్హతలు ఎలా ఉండాలనే విషయమై కసరత్తు చేస్తున్నారు. జిల్లాకు చెందిన పలువురు నాయకులు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నారు. జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్, నగర మేయర్, మున్సిపల్ చైర్‌పర్సన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీల పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నవారు, పార్టీ పదవులు ఆశిస్తున్నవారిలో ఉత్కంఠ, ఆసక్తి నెలకొంది. మీనాక్షి మార్క్ ఎంపికలు ఎలా ఉంటాయనే విషయమై పార్టీ శ్రేణుల్లో ఆసక్తి నెలకొంది.

జిల్లా కలెక్టర్‌గా వినయ్ కృష్ణారెడ్డి

- రెవెన్యూ స్పెషల్ సెక్రెటరీగా రాజీవ్ గాంధీ హనుమంతు బదిలీ

నిజామాబాద్‌అర్బన్ : జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు బదిలీ అయ్యారు. నూతన కలెక్టర్‌గా టీ వినయ్ కృష్ణారెడ్డి జిల్లాకు వస్తున్నారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. 2013 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన

వినయ్ కృష్ణారెడ్డి ప్రస్తుతం ఆర్, ఆర్ అండ్ ఎల్‌ఏ, ఐక్యాడ్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. గతంలో సూర్యాపేట కలెక్టర్‌గా, నీటిపారుదల కమాండ్ ఏరియా అభివృద్ధి శాఖ కమిషనర్‌గా చేశారు. రాజీవ్ గాంధీ హనుమంతు స్టాంపులు, రిజిస్ట్రేషన్లు,



టీ. వినయ్‌కృష్ణారెడ్డి

రెవెన్యూ శాఖ స్పెషల్ సెక్రెటరీగా వెళ్తున్నారు. అలాగే ఆయనకు రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్, భూభారతి కమిషనర్‌గా అదనపు బాధ్యతలు కూడా అప్పగించారు. రాజీవ్ గాంధీ హనుమంతు 2023 ఫిబ్రవరి 1న జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈయన హయాంలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు జరిగాయి.

రెండు ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించారని పేరొచ్చింది. ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో నిలిచింది.

ఇఫ్కో ద్వారా నాణ్యమైన ఎరువులు

మోర్తాడ్: ఇఫ్కో ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు అందుబాటులో ఉంటున్నాయని ఆ సంస్థ జాతీయ డైరెక్టర్, మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి అన్నారు. మోర్తాడ్‌లో గురువారం ఇఫ్కో బజార్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ తెలంగాణ సేల్స్ మేనేజర్ కృపా శంకర్, తెలుగు రాష్ట్రాల రీజినల్ మేనేజర్ పొన్నం రాజు, డీసీసీబీ డైరెక్టర్ మోత్కు భూమన్న, సంస్థ ఫీల్డు మేనేజర్ శివరామకృష్ణ, మోర్తాడ్, కమ్మర్‌పల్లి సహకార సంఘాల చైర్మన్‌లు బద్దం అశోక్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



మోర్తాడ్‌లో ఇఫ్కో బజార్‌ను ప్రారంభిస్తున్న గంగారెడ్డి

ఇక అన్ని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్

- ఇప్పటి వరకు 80 ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అధికారులు
- నిర్వహణకు నిధులు మాత్రం ఇవ్వని సర్కారు



డొంకేశ్వర్(ఆర్మూర్) : జిల్లాలోని అన్ని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ అందుబాటులోకి రానుంది. అవసరమున్న ప్రాంతాల్లో వేగంగా టీవీ యూనిట్లను బిగిస్తున్నారు. మొన్నటి వరకు మండలానికి ఒకటి చొప్పున 31 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం ఉండగా, ప్రస్తుతం మూడో విడతలో 49 రైతు వేదికల్లో కూడా ఈ సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. దీంతో జిల్లాలో మొత్తం 106 రైతు వైదికలకు గాను ఇప్పటి వరకు 80 వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ అందుబాటులోకి వచ్చింది. మిగతా రైతు వేదికల్లో కూడా ఈ సదుపాయం త్వరలో అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రభుత్వం ప్రతి మంగళవారం రైతులకు సాగులో సలహాలు, సూచనలు అందిస్తున్న విషయం తెలిసిందే.

ఏఈవోలు, ఏవోలపై భారం

నిరుపయోగంగా ఉన్న రైతు వేదికలను ఉపయోగంలోకి తేవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను ఏర్పాటు చేసింది. ఐతే, వీటి నిర్వహణకు మాత్రం నిధులు ఇవ్వడం లేదు. జిల్లాలోని 106 రైతుల వేదికలకు రెండేళ్ల క్రితం రూ.9 వేల చొప్పున ఐదు నెలలకు నిధులు ఇచ్చింది. అప్పటి నుంచి మళ్లీ నిధులు ఇవ్వకపోవడంతో ఏఈవోలు, ఏవోలపై భారం పడుతోంది. ఇప్పుడు వీడియో కాన్ఫరెన్స్ అందుబాటులోకి రావడంతో దాని నిర్వహణ, ఇంటర్నెట్ ఖర్చులు కూడా అదనం అయ్యాయి. టీజీ ఫైబర్ ఇంటర్నెట్ సేవలు లేకపోవడంతో వ్యవసాయాధికారులు తమ ఫోన్ల వైఫై ద్వారా వీడియో కాన్ఫరెన్స్‌లను నడిపిస్తున్నారు.

“ నిధులు కోరుతాం..



అన్ని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇది రైతులకు ఎంతో ఉపయోగకరం. అలాగే రైతు వేదికల నిర్వహణకు నిధులు రావడం లేదనే విషయం వాస్తవమే. నిధుల అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరయ్యేలా చూస్తాం.

– వీరాస్వామి, జిల్లా వ్యవసాయాధికారి

రాయితీ విత్తనాలు లేనట్లేనా...?

- పెట్టుబడి అందిస్తున్నామనే సాకుతో రాయితీ విత్తనాల పంపిణీకి మంగళం పాడిన ప్రభుత్వం
- గతంలో సోయా, మొక్కజొన్న విత్తనాలు రాయితీపై సహకార సంఘాల ద్వారా విక్రయం

మోర్తాడ్(బాల్కొండ): రాయితీ విత్తనాల సరఫరా నిలిచిపోవడంతో రైతులపై విత్తన కొనుగోలు భారం ఏర్పడుతోంది. గతంలో ప్రతి వర్షాకాలం సీజనులో మొక్కజొన్న, సోయా రాయితీపై అందించేవారు. సహకార సంఘాల ద్వారా రాయితీ విత్తనాల వ్యాపారం చేయడం వల్ల సంఘాలకు ఆదాయం కలిసివచ్చేది. ప్రభుత్వం ద్వారా విత్తనాల పంపిణీ సాగడం వల్ల రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేవి. 35 శాతం వరకూ రాయితీ లభించడంతో రైతులు విత్తనాల కొనుగోలుకు తక్కువనే ఖర్చు చేసేవారు. ప్రభుత్వం నాణ్యతా ప్రమాణాలు పాటించే కంపెనీల విత్తనాలను విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా కొనుగోలు చేయించేది. విత్తనాల కొనుగోలు కోసం రైతులు తక్కువ ఖర్చు చేయడంతో పాటు ఎంతో మేలు రకమైన విత్తనాలను తీసుకుని పంటలను సాగు చేసేవారు. 2018లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించడం మొదలు పెట్టిన నుంచి రాయితీ విత్తనాల సరఫరాకు బ్రేక్ పడింది. పెట్టుబడి సాయం కూడా సీజను ఆరంభమైన సమయంలో కాకుండా తమకు వీలును బట్టి ప్రభుత్వం అందించడం వల్ల ఆ సొమ్ము సరైన పనులకు ఉపయోగపడటం లేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. రాయితీ విత్తనాలు సీజను ఆరంభంలోనే అందించేవారు. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా రాయితీ విత్తనాల సరఫరాపై దృష్టి సారించకపోవడంతో రైతుల్లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. ప్రభుత్వం పునరాలోచన చేసి రాయితీ విత్తనాల సరఫరాను పునఃప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

“ రాయితీ విత్తనాలు అందిస్తే మేలు



ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయం కొందరు మాత్రమే సద్వినియోగం చేసుకుంటున్నారు. అనేక మంది వృథాగానే ఖర్చు చేస్తున్నారు. రాయితీపై విత్తనాలు ఇతర వ్యవసాయ పరికరాలను అందిస్తే రైతులకు ఉపయోగంగా ఉంటుంది. వ్యవసాయం చేసేవారికి ప్రయోజనం కల్పించే పథకాలపైనే దృష్టి పెట్టాలి.

– డాక్టర్ కిషన్‌రెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్త

వ్యాపారుల వద్ద కొనాల్సి వస్తోంది



రాయితీపై రైతులకు ఎంతో మేలు రకమైన విత్తనాలు అందేవి. ఇప్పుడు రాయితీ ఎత్తివేయడంతో వ్యాపారుల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాల్సి వస్తుంది. పెట్టుబడి సాయం ఇస్తున్నామనే సాకుతో రాయితీ విత్తనాలను అందించకపోవడం సరైంది కాదు. ప్రభుత్వం స్పందించి రాయితీ విత్తనాలను సరఫరా చేయాలి. – కౌద లింబాద్రి, రైతు, తొర్తి

యూరియా అవసరం మేరకే వాడాలి

- డీఏవో వీరస్వామి



మోపాల్ సొసైటీలో యూరియా నిల్వలను తెలుసుకుంటున్న డీఏవో

మోపాల్(నిజామాబాద్‌రూరల్): రైతాంగం అవసరం మేరకే యూరియా వాడాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏవో) వీరస్వామి పేర్కొన్నారు. మోపాల్ సొసైటీలో యూరియా నిల్వలు, యూరియా పంపిణీ చేసేవిధానం, తదితర అంశాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వీరస్వామి మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 5.35 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని అంచనా వేశామన్నారు. వర్ని, మోస్రా, చందూర్, బోధన్ సహా పలు మండలాల్లో వరినాట్లు ప్రారంభమైనట్లు తెలిపారు. రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, ఎక్కడ కూడా కొరత లేదని పేర్కొన్నారు. యూరియా కొరతపై దుష్ప్రచారాలను నమ్మొద్దని, రైతులు యూరియా నిల్వలు పెట్టుకొని కృత్రిమ కొరతను సృష్టించొద్దని సూచించారు. జిల్లాలో అధికంగా యూరియా వినియోగిస్తున్నారని, దీంతో పంట తెగుళ్ల బారినపడే అవకాశముందని పేర్కొన్నారు. ఆయన వెంట ఏవో సౌమ్య, సొసైటీ సీఈవో సాయిచంద్ తదితరులు ఉన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలిద్దాం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఉదయ భాస్కర్ రావు

నిజామాబాద్ లీగల్ : జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించి, బాల బాలికలకు మంచి భవిష్యత్తును అందిద్దామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఉదయ భాస్కర్ రావు అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం సందర్భంగా బాలల హక్కుల పరిరక్షణ–మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చంద్రశేఖర్ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాల బాలికలను కార్మికులుగా మార్చకుండా వారికి మంచి విద్యను అందించి, ఉజ్వల భవిష్యత్తును కల్పించాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బి మాట్లాడుతూ బాలల హక్కులను ప్రతి ఒక్కరూ కాపాడాలని అన్నారు. కార్మిక శాఖ అధికారి యోహాను మాట్లాడుతూ బాలబాలికలతో పనిచేయిస్తే వారికి కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలో బాలబాలికలకు అక్షరాభ్యాసం చేయించారు. డీసీపీవో చైతన్య, సీడీపీవో స్వర్ణలత, సూపర్వైజర్లు ప్రియదర్శిని, శ్రీప్రియ, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉదయ భాస్కర్ రావు



బడులు షురూ..

నిజామాబాద్‌అర్బన్ : జిల్లా వ్యాప్తంగా గురువారం పాఠశాలలు ప్రారంభమయ్యాయి. కొన్ని ప్రయివేటు పాఠశాలలు వర్షం కారణంగా సెలవు ప్రకటించాయి. ప్రభుత్వ పాఠశాలలు మాత్రం కొనసాగాయి. విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి రోజు పుస్తకాలు, దుస్తులను పంపిణీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు స్వాగత కార్యక్రమాలు నిర్వహించారు.

క్లుప్తంగా

వ్యవసాయ వర్సిటీ స్థాపన దినోత్సవం



యూనివర్సిటీ స్థాపన దినోత్సవ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, విద్యార్థులు

రుద్రూర్: హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం 61వ స్థాపన దినోత్సవ కార్యక్రమాన్ని గురువారం రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో శాస్త్రవేత్తలు, విద్యార్థులు ఆన్‌లైన్‌లో వీక్షించారు. విశ్వవిద్యాలయం స్థాపించినప్పటి నుంచి చేపట్టిన పరిశోధనలు, రూపొందించిన వంగడాలు, రైతుల జీవితాల్లో తెచ్చిన మార్పులపై వక్తలు వివరించారు. కార్యక్రమంలో పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ టీ అంజయ్య, కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు, సిబ్బంది, వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ డైట్ కళాశాలలో తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ మీడియంలో బోధించేందుకు అతిథి అధ్యాపక (గెస్ట్ లెక్చరర్) పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ టి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సొషియాలజీ, సైకాలజీ, సైన్స్, మ్యాథ్స్, సోషల్, తెలుగు, ఫైన్ ఆర్ట్స్, ఫిజికల్ డైరెక్టర్, సోషల్ సైన్స్ లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీ, ఎంఈడీ చేసిన 65 సంవత్సరాలలోపు వారు ఈనెల 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంఈడీ లేనిపక్షంలో బీఈడీ చేసిన వారికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 21న అర్హుల జాబితా ప్రకటిస్తామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15,600 నుంచి రూ.23,400 వరకు వేతనం అందించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులకు ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు మెరిట్ ప్రాతిపదికన ఇంటర్వ్యూలు నిర్వహించి నియమిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 94404 14198 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆలయంలో చోరీ

నవీపేట: మండల కేంద్రంలోని లింగం గుట్ట రేణుకా ఎల్లమ్మ ఆలయంలో దుండగులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై వినయ్ గురువారం తెలిపారు. ఆలయ నిర్వాహకుడు శేఖర్‌గౌడ్ గురువారం ఆలయానికి వెళ్లగా తాళాలు పగులగొట్టి ఉన్నాయని పేర్కొన్నారు. గర్భగుడిలోకి వెళ్లి చూడగా పంచలోహాల ఉత్సవ విగ్రహం, మంగళహారతులు, మైక్‌సెట్ తదితర వస్తువులను ఎత్తుకెళ్లారని తెలిపారు. శేఖర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాడుతున్న 10 మంది అరెస్టు

ఖలీల్‌వాడి: శాస్త్రీనగర్ గ్రామ శివారులో బుధవారం రాత్రి 12:30 గంటలకు పేకాడుతున్న 10 మందిని అరెస్ట్ చేసినట్లు ఆరో టౌన్ ఎస్సై వెంకట్రావు గురువారం తెలిపారు. మీర్జా జావీద్ బేగ్ ఖాళీ స్థలంలో ఉన్న రేకుల షెడ్డులో 10మంది పేకాట ఆడుతుండగా పట్టుకొని, వారి నుంచి రూ.76 వేలు, ఒక కారు, రెండు బైక్‌లు, 12 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ప్రభుత్వ భూములు కాపాడాలి

ఆర్మూర్‌టౌన్: పెర్కిట్‌లో విజేత అపార్ట్‌మెంట్ పక్కన గల ఇరిగేషన్ ల్యాండ్‌ను అక్రమంగా కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజుకు గురువారం ఖాందేశ్ ప్రశాంత్ ఫిర్యాదు చేశారు. గతంలో ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేశానన్నారు. ఇరిగేషన్, 10 శాతం ప్రభుత్వ భూములను కాపాడాలన్నారు.

పొక్లెయిన్ సీజ్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని అటవీ భూమిలో రెండు రోజుల క్రితం పొదలను తొలగించిన పొక్లెయిన్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి వాసుదేవ్ గురువారం తెలిపారు. రెండు రోజుల క్రితం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎర్రకుంట తండా సమీపంలోని అటవీభూమిలో పొదలను తొలగించారని అందిన విశ్వసనీయ సమాచారం మేరకు విచారణ చేపట్టామన్నారు. పొదలను తొలగించిన మెదక్ జిల్లాకు చెందిన పొక్లెయిన్‌ను పట్టుకొని కేసు నమోదు చేసి సీజ్ చేసినట్లు వివరించారు.



బోర్గాం(పి) జెడ్పీ హైస్కూల్‌లో ప్రార్థన నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బడిబాట పట్టారు..



వర్షం కురుస్తుండగా పిల్లలను బైక్‌పై పాఠశాలకు తీసుకెళ్తున్న వ్యక్తి



బోర్గాం(పి) జెడ్పీ హైస్కూల్‌కు వస్తున్న విద్యార్థులు

వేసవి సెలవుల్లో సరదాగా గడిపిన జిల్లాలోని విద్యార్థులు గురువారం బడి బాట పట్టారు. పుస్తకాలతో అడుగులు వేశారు. ఉదయమే స్కూలుకు వెళ్లేందుకు రెడీ అయ్యారు. తల్లిదండ్రులు తమ పిల్లలను స్కూల్ వద్ద దింపగా మరికొందరు ఆటోల్లో పాఠశాలలకు చేరుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తెరుచుకోవడంతో ఉపాధ్యాయులు, పిల్లలు, తల్లిదండ్రులతో కోలాహలంగా మారాయి.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ –నిజామాబాద్

సమస్యల పరిష్కారానికే భూ భారతి

అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్



కంజర్ రైతు వేదికలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమలు చేస్తుందని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కంజర్ రైతువేదికలో గురువారం భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ రామేశ్వర్ రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలు ఉన్న రైతులంతా సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2014కు ముందు రాసుకున్న సాదాబైనామా, భూమి విస్తీర్ణం, పట్టా పాస్ పుస్తకంలో పేర్లు, విస్తీర్ణంలో తప్పులు, ఇతరత్రా సమస్యలన్నింటికీ భూభారతిలో పరిష్కారం దొరుకుతుందన్నారు. మండలంలో 1,342 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ రామేశ్వర్ అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అంతకు ముందు నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ దరఖాస్తులను పరిశీలించారు. వారి వెంట ఆర్‌ఐ రాజేశ్వర్, సిబ్బంది ఉన్నారు.



మొరం కుప్పల చదును

నవీపేట: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో వేసిన మొరం కుప్పలను గురువారం చదును చేశారు. ఆవరణలో వర్షపు నీరు నిలుస్తుండడంతో మొరం వేసి చదును చేయించాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. కానీ, మొరం కుప్పలను వేసిన అధికారులు వాటిని చదును చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శించారు.

సాక్షి ఎఫెక్ట్..

పాఠశాల పునఃప్రారంభం రోజే దర్శనమిచ్చిన వర్షపు నీరు...మొరం కుప్పల దుస్థితిపై 'సాక్షి'లో 'సారూ..బడికి ఎలా వెళ్లాలి' శీర్షికన బుధవారం వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు గురువారం మొరం కుప్పలను బ్లేడ్ ట్రాక్టర్‌తో చదును చేయించారు.

శిలాఫలకం ధ్వంసం

● పోలీసులకు ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న రజకసంఘం సభ్యులు

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రానికి సమీపంలోని పలుగుట్ట ప్రాంతంలో మండల రజక సంఘం కల్యాణ మండప నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ మేరకు రజక సంఘం సభ్యులు గురువారం ఆందోళన చేపట్టి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం తహసీల్దార్‌కు మెమోరండం అందజేశారు. ఈ సందర్భంగా రజక సంఘం మండల అధ్యక్షుడు గవాస్కర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి రజకుల కల్యాణ మండపం కోసం ఎకరం భూమి కేటాయించి రూ. 20 లక్షల ప్రొసీడింగ్‌తో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి భూమిపూజ చేశారని తెలిపారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు



గాయపడ్డ బాలుడిని అంబులెన్సులో ఎక్కిస్తున్న మాజీ సర్పంచ్ ఫారూఖ్

గాంధారి(ఎల్లారెడ్డి): అదుపు తప్పి ఆటో బోల్తా పడడంతో ఒకే కుటుంబానికి చెందిన పలువురికి గాయాలైన ఘటన మండల పరిధిలోని మేడిపల్లి సమీపంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు, అంబులెన్సు సిబ్బంది ఈఎంటీ సురేశ్, పైలట్ ప్రకాశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గాంధారి మండల కేంద్రానికి చెందిన ఆరిఫ్ కుటుంబసభ్యులతో బడాపహాడ్ దర్శనం కోసం ఆటోలో బయల్దేరారు. గాంధారి– బాన్సువాడ ప్రధాన రహదారిలో బుగ్గగండి ప్రాంతంలో ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన లోయలో పడిపోయింది. దీంతో ఆటో నడుపుతున్న ఆరిఫ్‌తోపాటు అందులో ప్రయాణిస్తున్న మహిళలు, పిల్లలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, గండివేట్ మాజీ సర్పంచ్ ఫారూఖ్ 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రులను లోయలో నుంచి పైకి తీసుకొచ్చి అంబులెన్సులో ఎక్కించారు. ఆరిఫ్‌తోపాటు చిన్నారులు అమ్రాన్, అర్బాన్, షరీనా, షాబీనాకు తీవ్రగాయాలు కాగా మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలంలో సహాయం చేసిన మాజీ సర్పంచ్ ఫారూఖ్‌ను పలువురు అభినందించారు.

పోలీసులకు పట్టించారని దాడి

ఖలీల్‌వాడి: పోలీసులకు పట్టించారంటూ యూత్ సభ్యులపై దాడి చేసిన వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు మూడో టౌన్ ఎస్సై హరిబాబు తెలిపారు. గౌతమ్ నగర్ చెందిన షేక్ అబ్దుల్ గఫార్, అతని మిత్రులు షేక్ అవేజ్, మహేశ్, సచిన్ కలిసి బుధవారం రాత్రి యూత్ సభ్యులపై ఇటుకలు, కర్రలతో దాడి చేశారన్నారు. గఫార్ గత నెలలో గంజాయి కేసులో పోలీసులకు పట్టుబడడంతో గౌతమ్ నగర్ చెందిన వారే పోలీసులకు పట్టించారనే అనుమానంతో యూత్ సభ్యులపై కక్షగట్టి రాత్రి దాడి చేసినట్లు తెలిపారు. గఫార్, అతని మిత్రులపై కేసు నమోదు చేసి ఇద్దరిని కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు. గఫార్‌తోపాటు అతని మిత్రులపై గతంలో కేసులు ఉన్నట్లు చెప్పారు.

క్రైం కార్నర్

అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి



బాన్సువాడ : పట్టణంలోని వాసవీకాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్న గోజే రాఘవేందర్ (36) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పిట్లం మండలం మద్దెల్‌చెర్వు గ్రామానికి చెందిన రాఘవేందర్ మూడేళ్లుగా ఓ స్టీల్ దుకాణంలో పనిచేస్తూ బాన్సువాడలో నివాసముంటున్నాడు. గుంటూరుకు చెందిన అంబికను ప్రేమించి పెద్దల అంగీకారంతో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ నెల 9న అంబిక తన బంధువుల ప్రథమ దినకర్మకు గుంటూరుకు వెళ్లింది. పిల్లలను మద్దెల్‌చెర్వులో ఉండే బావ రాజేందర్ ఇంట్లో ఉంచింది. రెండు రోజులుగా భర్త రాఘవేందర్‌కు ఫోన్ చేసినా కలవకపోవడంతో రాజేందర్‌కు సమాచారం ఇచ్చింది. దీంతో రాజేందర్ తల్లిని బాన్సువాడలోని తమ్ముడి ఇంటికి పంపగా, లోపలి నుంచి తాళాలు వేసి ఉన్న విషయం తెలిసింది. రాజేందర్ డయల్ 100కు సమాచారం ఇవ్వగా, పోలీసులు వచ్చి తలుపులు పగులగొట్టడంతో రాఘవేందర్ శవమై కనిపించాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన యువకుడు గురువారం కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. గ్రామానికి చెందిన స్వర్ణబాబు(25) డబ్బుల విషయంలో తన భార్య, తల్లితో గొడవ పెట్టుకున్నాడు. దీంతో మనస్తాపం చెందిన అయన ఇంటి వద్ద ఉన్న గొర్రెల కొట్టంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

నవీపేటలో మరో యువకుడు..

నవీపేట: మండల కేంద్రంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన విక్కీ (25) మహంతం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వినయ్‌కుమార్ గురువారం తెలిపారు. ఈ నెల 9న ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన విక్కీ తిరిగి రాలేదన్నారు. భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేశామని తెలిపారు. విచారణ చేపట్టగా కుటుంబ కలహాలతోపాటు మతిస్థిమితం లేకపోవడంతోనే విక్కీ మహంతం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చోరీ కేసులో ఒకరికి ఏడేళ్ల జైలు

నిజామాబాద్ లీగల్: ధర్పల్లి మండలం దుబ్బాక ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ దొంగతనం కేసులో రెంజల్ మండల కేంద్రానికి చెందిన సంతోష్ రెడ్డికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 3 వేల జరిమానా విధిస్తూ మొదటి అదనపు జిల్లా జడ్జి కనకదుర్గ గురువారం తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. రెంజల్‌కు చెందిన ఆలూరు సంతోష్ రెడ్డి గతంలో అనేక కేసుల్లో జైలు శిక్ష అనుభవించాడు. జైలు నుంచి విడుదలైన తర్వాత ధర్పల్లి మండలం దుబ్బాకలోని తన బంధువుల వద్ద ఉంటూ ఎలక్ట్రీషియన్‌గా పనిచేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. దుబ్బాక వెళ్లిన సంతోష్ రెడ్డి తన దుర్బుద్ధిని వీడలేదు. 2024 జనవరి 1న దుబ్బాకలోని బ్యాంకు వద్ద సెక్యూరిటీ గార్డుతో సహా ఎవరూ లేకపోవడంతో బ్యాంకు దోపిడీకి పథకం వేశాడు. అందుకు తన కిట్ బ్యాగు, గడ్డపారతో బయల్దేరి బ్యాంకు షటర్‌ను ధ్వంసం చేసి లోనికి ప్రవేశించాడు. గడ్డపారతో స్ట్రాంగ్ రూం ధ్వంసం చేసేందుకు యత్నించగా మేనేజర్ బానోత్ రాజు మొబైల్‌కు సెక్యూరిటీ సిస్టం ద్వారా మెసేజ్ వచ్చింది. అప్రమత్తమైన రాజు అసిస్టెంట్ మేనేజర్‌తో కలిసి బ్యాంకు వద్ద చేరుకున్నాడు. షటర్లు ధ్వంసం చేసి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించాడు. ధర్పల్లి ఎస్సై వంశీ రెడ్డి గ్రామస్తులతో కలిసి బ్యాంకు వద్దకు చేరుకొని సంతోష్ రెడ్డిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసును విచారించి, సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి కనకదుర్గ నిందితుడికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధించారు. పోలీసులు తరఫున డీడీవోపీ లక్ష్మీనరసయ్య వాదించారు.

రాళ్ల గుట్టపై.. నీళ్ల బావి

మీకు తెలుసా?



ఆర్మూర్ పట్టణంలోని నల్లని రాళ్లతో సహజ సిద్ధంగా ఏర్పడిన నవనాథ సిద్దుల గుట్టపై తాగునీటి అవసరాలు తీర్చే చేద బావిలో నీళ్లు, కోనేరులో ఊట ద్వారా వచ్చే నీళ్లు భక్తులకు సంభ్రమాశ్చర్యాలను కలిగిస్తాయి.

- సాగు అవసరాల కోసం వందల ఫీట్లు బోరు బావులు తవ్వే ఈ ప్రాంతంలో రాళ్ల గుట్టపై ఊట లేదా వర్షం ద్వారా నీళ్లు ఆశ్చర్యానికి గురిచేస్తాయి.
- ఎత్తయిన రాళ్ల గుట్టపై నిత్యం నీరుండేలా కోనేరును ఉంది.
- రామాలయం ఎదురుగా తవ్విన బావిలో ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సైతం నిత్యం నీళ్లు అందుబాటులో ఉండి ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి.
- వందల ఏళ్ల క్రితం నవనాథులు గుట్టపై తపస్సు చేసుకొంటూ సిద్ధేశ్వరుడిని కొలిచే కాలంలో ఈ చేద బావి, కోనేరును నిర్మించినట్లు స్థల పురాణం ద్వారా తెలుస్తోంది.

– ఆర్మూర్

విద్యుత్ శాఖ అధికారుల ఫోన్ నెంబర్లు

హోదా	ఫోన్ నంబర్లు	హోదా	ఫోన్ నంబర్లు
ఎస్ఈ/ఆపరేషన్/ నిజామాబాద్	8712485161	ఏడీఈ/ఆపరేషన్/నందిపేట	8712485696
డీఈ/టెక్నికల్ / నిజామాబాద్	8712485162	ఏడీఈ/ఆపరేషన్/నవీపేట	8712485725
డీఈ/ఆపరేషన్/ నిజామాబాద్	8712487062	ఏడీఈ/ఆపరేషన్/డిచ్‌పల్లి	8712485560
డీఈ/ఆపరేషన్/డిచ్‌పల్లి	8712485504	ఏడీఈ/ఆపరేషన్/ని.రూరల్	8712485620
డీఈ/ఆపరేషన్/బోధన్	8712485377	ఏడీఈ/ఆపరేషన్/బోధన్	8712485405
డీఈ/ఆపరేషన్/ఆర్మూర్	8712485212	ఏడీఈ/ఆపరేషన్/రుద్రూరు	8712485464
ఏడీఈ/ఆపరేషన్/ నిజామాబాద్ టౌన్-1	8712485750	ఏడీఈ/ఆపరేషన్/ఎడపల్లి	8712485497
ఏడీఈ/ఆపరేషన్/ని.టౌన్-2	8712485791	ఏడీఈ/ఆపరేషన్/ఆర్మూర్	8712485244
ఏడీఈ/ఆపరేషన్/ని.టౌన్-3	8712485807	ఏడీఈ/ఆపరేషన్/పెర్కిట్	8712485355
		ఏడీఈ/ఆపరేషన్/భీమ్‌గల్	8712485273
		ఏడీఈ/ఆపరేషన్/మోర్తాడ్	8712485308
		ఎలక్ట్రిసిటీ కంట్రోల్‌రూమ్	8712485205

– సుభాష్‌నగర్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ తుకారాం రాథోడ్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): వానాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్యసిబ్బందితో తాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇళ్లు, వన మహోత్సవం, బడిబాట తదితర అంశాలపై ఎంపీడీవో రాములు నాయక్ అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుకారాం రాథోడ్ మాట్లాడుతూ గ్రామాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని తెలిపారు. మురుగుకాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, తాగునీటిని క్లోరినేషన్ చేయాలని సూచించారు. ఎంపీడీవో రాములు నాయక్ మాట్లాడుతూ మండలానికి 502 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, 178 ఇళ్ల నిర్మాణం ప్రారంభమైందన్నారు. సమావేశంలో మెడికల్ ఆఫీసర్ ప్రత్యూష, ఎంపీవో కిరణ్‌కుమార్, ఎంఈవో గేమ్ సింగ్, ఏపీవో సునీత, ఏఈలు అన్నపూర్ణ, వినయ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

డీఈవో అశోక్



విద్యార్థులకు నోట్‌బుక్స్, యూనిఫామ్ అందజేస్తున్న డీఈవో అశోక్

జక్రాన్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని డీఈవో అశోక్ పేర్కొన్నారు. జక్రాన్‌పల్లి మండలం లక్ష్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, నోట్ బుక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. అనంతరం పదో తరగతిలో మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థినులను డీఈవో అభినందించారు. ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ చిన్న సాయరెడ్డి, ఎంఈవో శ్రీనివాస్, హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు గోపి, ప్రధాన కార్యదర్శి రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు పట్టిస్తాడనే భయంతోనే చంపేశాడు

హత్య కేసులో ఒకరి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్‌రాజ్

ఖలీల్‌వాడి: బైక్ దొంగతనం చేసిన తనను పోలీసులకు ఎక్కడ పట్టిస్తాడోననే భయంతో పాంగ్రా శివారులో ఒకరిని హత్య చేసిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నగర సీఐ శ్రీనివాస్ రాజు తెలిపారు. నగరంలోని తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. నాల్గో టౌన్ పరిధిలోని సంజీవ్‌రెడ్డి కాలనీకి చెందిన వసంత్‌కుమార్ అలియాస్ టిల్లు(38), గాజులపేట్‌కు చెందిన సర్దార్ తేజసింగ్ అలియాస్ దయాసింగ్ స్నేహితులు. వసంత్‌కుమార్ ఓ ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తుండగా, తేజసింగ్ జులాయిగా తిరిగేవాడు. జల్సాలకు డబ్బులు అవసరమై తేజ్‌సింగ్ ఈ నెల 7న గంగస్థాన్ ఫేస్–2లో ఓ బైక్‌ను దొంగిలించాడు. ఆ బైక్‌ను అమ్మేందుకు ఈ నెల 9న సాయంత్రం వసంత్‌కుమార్‌కు ఫోన్ చేసి రూ.25 వేలు అవసరం ఉంది, బైక్‌పై లోన్ ఇప్పించాలని అడిగాడు. దీంతో వసంత్‌కుమార్ బైక్ ఆర్‌సీ, ఆధార్ తీసుకొని వస్తే మూడు రోజుల్లో లోన్ ఇప్పిస్తానని చెప్పాడు. తేజ్‌సింగ్ బైక్ తన పేరు మీద లేదని వేరే వాళ్లదని, అర్జెంటుగా డబ్బులు కావాలని బతిమిలాడగా, బైక్‌ను తాకట్టు పెట్టుకొని రూ.3 వేలు ఇస్తానని వసంత్‌కుమార్ తెలిపాడు. దీంతో ఇద్దరూ కలిసి పాంగ్రా శివారులో మద్యం సేవించేందుకు వెళ్లారు. అక్కడ డబ్బులు ఇచ్చిన వసంత్‌కుమార్ బైక్ పేపర్లు ఇవ్వాలని తేజ్‌సింగ్‌ను అడగడంతో సరైన సమాధానం చెప్పలేదు. దీంతో అనుమానం వచ్చి దొంగిలించిన బైక్‌ను తాకట్టు పెడుతున్నావా? అని తన డబ్బులు తిరిగి ఇచ్చేయాలనడంతో తర్వాత ఇస్తానని తేజ్‌సింగ్ చెప్పాడు. దీంతో వసంత్‌కుమార్ బైక్ ఎక్కడ దొంగతనం చేశావు, పోలీసులకు చెప్తానని అన్నాడు. భయపడిన తేజ్‌సింగ్ పక్కనే ఉన్న బండరాళ్లతో తల, ముఖంపై దాడి చేయడంతో వసంత్‌కుమార్ అక్కడిక్కడే మృతి చెందాడు. 10న గుర్తు తెలియని వ్యక్తి హత్యగా కేసు నమోదు చేసుకొని సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు ఏసీపీ పర్యవేక్షణలో దర్యాప్తు ప్రారంభించారు. మృతుడు వసంత్‌కుమార్ అలియాస్ టిల్లుగా గుర్తించి విచారణ వేగవంతం చేసినట్లు తెలిపారు. గురువారం పాంగ్రా గ్రామ శివారులో దొంగిలించిన మోటార్ సైకిల్‌పై అనుమానాస్పదంగా తిరుగుతున్న తేజ్‌సింగ్‌ను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడి నుంచి రెండు సెల్‌ఫోన్లు, హత్యకు ఉపయోగించిన బండరాయి, బైక్ తదితర వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు ఛేదించిన సీఐ శ్రీనివాస్‌రాజ్, నాల్గో టౌన్ ఎస్సై కే శ్రీకాంత్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

భార్యపై కోపంతో కొడుకు హత్య

● ఊపిరాడకుండా చేసి అంతమొందించిన తండ్రి



శశాంక్ మృతదేహంతో రోదిస్తున్న కుటుంబీకులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): భార్యపై కోపంతో నాలుగేళ్ల కొడుకును ఓ తండ్రి హతమార్చిన ఘటన గురువారం నాగిరెడ్డిపేట మండలం పోచారం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం గ్రామానికి చెందిన బోయిని శ్రీహరి తన కూతురు అక్షితను ఐదేళ్ల క్రితం లింగంపేట మండలం పొల్కంపేట గ్రామానికి చెందిన నర్వ అనిల్‌కు ఇచ్చి పెళ్లి చేశాడు. వీరికి కొడుకు శశాంక్(4), కూతురు మనుశ్రీ (7 నెలలు) ఉంది. కాగా, అనిల్, అక్షిత పిల్లలతో కలిసి మంగళవారం మెదక్ జిల్లా శాలిపేట గ్రామంలో జరిగిన బోనాల పండుగ కోసం బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడ పిల్లలు ఆడుకుంటున్న క్రమంలో అనిల్ చెల్లెలు కూతురును శశాంక్ మెట్లపై నుంచి తోసేశాడు. ఈ విషయమై శాలిపేటలో గొడవ జరిగింది. తిరిగి పొల్కంపేటకు చేరుకున్న తర్వాత భార్యాభర్తలిద్దరూ గొడవ పడ్డారు. అదే సమయంలో అనిల్ తన భార్య అక్షితను కొట్టాడు. గురువారం అక్షితకు వైద్యం చేయించేందుకు పిల్లలతో కలిసి పోచారం గ్రామానికి వచ్చారు. అనంతరం కొడుకు శశాంక్‌ను బయట తిప్పుతానని చెప్పి బైక్‌పై పోచారం గ్రామశివారుకు తీసుకెళ్లాడు. శశాంక్ ముక్కు, నోరు మూసి స్పృహ కోల్పోయేలా చేసి అత్తారింటికి తీసుకువచ్చాడు. గమనించిన కుటుంబసభ్యులు శశాంక్‌ను చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాలుడు అప్పటికే మృతి చెందాడని చెప్పారు. అనిల్‌ను నిలదీయగా భార్యపై కోపంతో తానే శశాంక్‌ను హత్య చేశానని చెప్పి పారిపోయాడు. అక్షిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.